క్లుప్తంగా

15 స్టీల్ పుష్‌కార్ట్స్ వితరణ



మున్సిపల్ కార్పొరేషన్‌కు 15 స్టీల్ పుష్‌కార్ట్స్‌ను వితరణ చేస్తున్న డీబీఆర్‌సీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: దళిత బహుజన్ రిసోర్స్ సెంటర్(డీబీఆర్‌సీ) ఆధ్వర్యంలో టెట్రా ప్యాక్ సహకారంతో గురువారం తిరుపతి నగర పాలక సంస్థకు 15 స్టీల్ పుష్‌కార్ట్స్ వితరణ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య మాట్లాడుతూ ఈ పుష్‌కార్ట్స్ వాడకం ద్వారా వ్యర్థాల వర్గీకరణ మరింత సమర్థవంతంగా సాగుతుందని, ఫలితంగా నగరం మరింత పరిశుభ్రంగా మారుతుందని తెలిపారు. వ్యర్థాల నిర్వహణలో మున్సిపల్ కార్పొరేషన్‌కు మద్దతు అందించిన డీబీఆర్‌సీ, టెట్రా ప్యాక్‌ను ఆమె అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ అదనపు కమిషనర్ చరణ్‌తేజ్, డీబీఆర్‌సీ కోఆర్డినేటర్ అమల, ఫీల్డ్ కోఆర్డినేటర్ తేజశ్రీ, స్వప్న పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ చేయాలి



మాట్లాడుతున్న పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు అరుల్ అరసు

తిరుపతి కల్చరల్: రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన పాస్టర్ పగడాల ప్రవీణ్ మరణంపై సీబీఐ విచారణకు ఆదేశించి సమగ్ర విచారణ చేయాలని ప్రభుత్వాన్ని పాస్టర్స్ ఫెలోషిప్ నేతలు డిమాండ్ చేశారు. గురువారం జీవకోనలోని షెకినా చర్చిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు అరుల్ అరుసు మాట్లాడారు. ఈనెల 25న పగడాల ప్రవీణ్ మరణించిన విధానం చూస్తే అది ప్రమాదం కాదు హత్య జరిగి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. పాస్టర్స్ ఫెలోషిప్ కార్యదర్శి జయపాల్ మాట్లాడుతూ క్రైస్తవ సమాజం మంచి వ్యక్తిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాస్టర్ పగడాల మృతి పట్ల సందేహాలు ఉన్న నేపథ్యంలో సీబీఐ విచారణ జరిపించాలని కోరారు. సమావేశంలో పాస్టర్లు అజరయ్య, దిలీప్‌కుమార్, పీటర్, పీరారెడ్డి, జెర్నియా, తిమోతి దేవర్ జాన్ పాల్గొన్నారు.

సీకాం డిగ్రీ కళాశాలకు న్యాక్ గుర్తింపు



సర్టిఫికెట్‌ను అందుకుంటున్న కళాశాల చైర్మన్ సురేంద్ర నాథ్ రెడ్డి, డైరెక్టర్ ప్రణీత్

తిరుపతి సిటీ: స్థానిక అన్నమయ్య సర్కిల్‌లో ఉన్న 'సీకాం' డిగ్రీ కళాశాలకు 'న్యాక్' రేటింగ్ ఏప్లస్ ప్లస్ గ్రేడ్ వచ్చినట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ సి.సురేంద్రనాథ రెడ్డి తెలిపారు. గత ఏడాది జనవరి 23, 24వ తేదీల్లో న్యాక్ పీర్ కమిటీ సభ్యులు కళాశాలను సందర్శించి వసతులు, విద్య నాణ్యత ప్రమాణాలను పరిశీలించి సీజీపీఏ 2.9 స్కోరుతో ఏ ప్లస్‌ప్లస్ గ్రేడ్ ప్రకటించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సీకాం కళాశాల ఈ ఘనతను రెండోసారి సాధించడం ఆనందంగా ఉందని చైర్మన్ తెలిపారు. ఇందుకు కృషి చేసిన విద్యార్థులను, అధ్యాపక, అధ్యాపకేతర బృందాలకు కళాశాల డైరెక్టర్లు ప్రణీత్ స్వరూప్, తేజస్వరూప్‌ను అభినందించారు.

ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ఉచిత కంటి పరీక్షలు



కళ్లను పరీక్షిస్తున్న వైద్యులు

తిరుపతి సిటీ: స్థానిక ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో గురువారం విద్యార్థులు, ఉద్యోగులకు సురేంద్ర ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200మంది విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి కంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఎండకాలంలో కళ్ల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆస్పత్రి డాక్టర్లు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరావతికి చేరిన శెట్టిపల్లి భూ సమస్య



శెట్టిపల్లి భూ సమస్యలపై మంత్రులుతో చర్చిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి కమిషనర్ మౌర్య

తిరుపతి అర్బన్: తిరుపతి శెట్టిపల్లి భూ సమస్య అమరావతికి చేరింది. గురువారం ఈ అంశాన్ని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, తిరుపతి కమిషనర్ నారపురెడ్డి మౌర్య సంయుక్తంగా రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్, పురపాలకశాఖా మంత్రి నారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం వచ్చే ఏప్రిల్‌లో లాటరీ పద్ధతిలో శెట్టిపల్లి ప్లాట్స్ 1.5 సెంట్లు చొప్పున అర్హులైన వారికి కేటాయింపులు చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.

విజయోత్సాహం

- తిరుపతి రూరల్ ఎంపీపీ సీటు వైఎస్సార్‌సీపీదే
- హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో భారీ భద్రత ఏర్పాటు చేసిన పోలీసులు
- ఓటింగ్‌లో పాల్గొన్న 34 మంది ఎంపీటీసీలు
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి 33 మంది ఎంపీటీసీల మద్దతు
- టీడీపీ తరఫున హాజరైన ఒకే ఒక అభ్యర్థి



విజయసంకేతం చూపుతున్న తిరుపతి రూరల్ ఎంపీపీ చంద్రమోహన్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండల పరిషత్ అధ్యక్ష స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఘన విజయం సాధించింది. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఎంపీపీ ఎన్నికకు 34 మంది ఎంపీటీసీలు హాజరయ్యారు. మొత్తం 37 మంది ఎంపీటీసీలు హాజరు కావాల్సి ఉండగా ముగ్గురు మాత్రమే గైర్హాజరయ్యారు. ఎన్నికకు అవసరమైన కోరం సరిపోవడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి జుబేదా, సహాయ ఎన్నికల అధికారి రామచంద్ర ఎన్నిక ప్రక్రియ ప్రారంభించారు. పార్టీ అధిష్టానం ఎంపీపీగా చంద్రమోహన్ రెడ్డి (పేరూరు-1)ని ప్రకటించగా వైస్‌ఎంపీపీ వి.మాధవరెడ్డి ప్రతిపాదించారు. మరో వైస్ ఎంపీపీ వి.యశోద బలపరచగా మిగతా మెజారిటీ ఎంపీటీసీలు తమ ఆమోదాన్ని తెలిపారు. దీంతో ఆయనను ఎంపీపీగా ఎన్నుకున్నట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం చంద్రమోహన్ రెడ్డికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేసి, ప్రమాణ స్వీకారం చేయించారు.

టీడీపీకి ఒక్కరే

తెలుగుదేశం పార్టీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన పెరుమాళ్లపల్లి-2 ఎంపీటీసీ తేజస్విని ఎన్నిక జరిగే ప్రదేశానికి కొంత ఆలస్యంగా చేరుకున్నారు. తమ పార్టీ తరఫున ఎంపీపీ అభ్యర్థిగా పోటీలో లేకున్నా ఎన్నికల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆమె తనకు కేటాయించిన సీటులో మౌనంగా కూర్చున్నారు. ఎంపీపీ ఎన్నికకు హాజరైనట్టుగా ఎన్నికల అధికారులు ఆమె వద్ద కూడా సంతకం సేకరించారు. ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ పూర్తయిన తరువాత అందరితో కలసి ఆమె బయటకు వెళ్లారు. కాగా వైఎస్సార్‌సీపీ గుర్తు మీద ఎంపీటీసీగా గెలిచి, ఇటీవల తెలుగుదేశంలో చేరిన అవిలాల-1 డి.వాణి కూడా వైఎస్సార్‌సీపీ ఎంపీపీ అభ్యర్థి మూలం చంద్రమోహన్‌రెడ్డికి మద్దతు తెలపడం గమనార్హం.

ఎంపీటీసీలకు రక్షణ వలయంగా పోలీసులు

ఎంపీపీ ఎన్నికల్లో పాల్గొనాల్సిన ఎంపీటీసీలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి తుమ్మలగుంటకు, అక్కడ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వద్దకు పోలీసులు రక్షణ వలయంగా నిలిచారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా పోలీసు ఉన్నతాధికారులు అప్రమత్తమై భారీ భద్రతా చర్యలు చేపట్టారు. తిరుపతి రూరల్ మండలంలోని ఎంపీటీసీల ఇళ్ల వద్ద రెండు రోజులు ముందు నుంచే భద్రతను కట్టుదిట్టం చేశారు.



ఎంపీపీగా ఎన్నికైన మూలం చంద్రమోహన్ రెడ్డికి డిక్లరేషన్ అందజేస్తున్న ఎన్నికల అధికారి జుబేదా

ఎన్నికలు పూర్తయ్యే వరకు ఉత్కంఠ

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ ఎంపీపీ ఎన్నికల్లో ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచే అప్రమత్తమైన వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పార్టీ ఎంపీటీసీలను క్యాంపునకు తరలించారు. దీంతో అధికార పార్టీకి చెందిన వారు ఎంపీపీ ఎన్నికల్లో పోటీ చేయడానికి సాహసించలేదు. క్యాంపునకు వెళ్లిన ఎంపీటీసీలు పోలీసుల భద్రత నడుమ ఎన్నిక జరిగే ప్రాంతానికి చేరుకోవడం, అప్పటికే పోలీసులు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకోవడం, ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసి లోపలకు అనుమతించారు. ఎలక్ట్రానిక్ మీడియా మొత్తం తమ కెమెరాలను అక్కడే ఫోకస్ పెట్టారు. చివరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎంపీపీ ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది.



గౌరవ అతిథులు డుమ్మా కొట్టడంతో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు



సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

గౌరవ అతిథులు అందరూ గైర్హాజరు

తిరుపతి రూరల్ మండల ఎంపీపీ ఎన్నికల్లో గౌరవ అతిథులుగా హాజరు కావాలసిన వారంతా గైర్హాజరయ్యారు. అందులో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఎమ్మెల్సీలు చంద్రశేఖర్‌రెడ్డి, కంచెర్ల శ్రీకాంత్, సిపాయి సుబ్రమణ్యం, కేఆర్‌జె భరత్ ఉన్నారు. ఎన్నిక ఆరంభం నుంచి ముగిసేంత వరకు వీరందరికీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కుర్చీలు ఖాళీగానే దర్శనమిచ్చాయి.

చెవిరెడ్డి ఇంట సంబరాలు..

తిరుపతి రూరల్ ఎంపీపీ ఎన్నికల్లో విజయం సాధించడంతో చంద్రగిరి నియోజకవర్గవ్యాప్తంగా పార్టీ నేతలు తిరుపతి రూరల్ మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకుని పెద్దఎత్తున బాణసంచా పేల్చి ఆనందాన్ని పంచుకున్నారు. అయితే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినా లెక్క చేయలేదు. అక్కడ నుంచి తుమ్మలగుంటకు చేరుకుని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి ఇంటి వద్దకు చేరుకుని సంబరాలు చేసుకోవడంతో కోలాహలంగా మారింది.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ఆలయాన్ని శుద్ధి చేస్తున్న అధికారులు

తిరుపతి కల్చరల్: నగరంలోని శ్రీగోవిందరాజ స్వామి వారి ఆలయంలో గురువారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఆలయంలో ఈనెల 30వ తేదీన ఉగాది ఆస్థానం సందర్భంగా రెండు రోజుల ముందు ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ చిరంజీవి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

30న ఉగాది ఆస్థానం

ఈనెల 30వ తేదీన ఉగాది సందర్భంగా సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు ఆలయంలో ఆస్థానం వైభవంగా జరుగనుంది.

పెద్దశేషుడిపై కోదండరాముడి వైభవం



ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపైకి అధిష్టిస్తున్న పండితులు



పెద్దశేషు వాహనంపై దర్శనమిస్తున్న కోదండరాముడు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు గురువారం రాత్రి పెద్దశేషువాహనాన్ని అధిరోహించి శ్రీకోదండ రామస్వామి ఊరుగుతూ భక్తులను అనుగ్రహించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మంగళ వాయిద్యాల నడుమ, భక్తజన భజనలు, నృత్య కళారూపాల నడుమ స్వామివారి పెద్దశేషు వాహన సేవ కోలాహలంగా సాగింది. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా ధ్వజారోహణం

ఉదయం ఆలయంలో కంకణభట్టర్ భరత్‌కుమార్ దీక్షితులు ఆధ్వర్యంలో ఉదయం 9.15 నుంచి 9.30 గంటల ధ్వజారోహణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గరుత్మంతుడి చిత్రంతో కూడిన ధ్వజపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకుల వేదమంత్రోచ్ఛరణలు, భక్తుల గోవింద నామస్మరణ, రామనామ జపమాల మధ్య ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపైకి అధిష్టింపజేశారు. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుల్లో ఒక్కరైన వేణుగోపాల దీక్షితులు, టీటీడీ ఆగమ సలహాదారు సీతారామాచార్యులు, డెప్యూటీ ఈఓలు గోవిందరాజన్, నాగరత్న, ఏఈఓ రవి తదితరులు పాల్గొన్నారు.

చింతగుంట ఉపసర్పంచ్ వైఎస్సార్‌సీపీదే



ఉపసర్పంచ్‌గా ఎన్నికైన అన్నపూర్ణ

భాకరాపేట : ఎర్రావారిపాళెం మండలం చింతగుంట గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా అన్నపూర్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, ఈఓపీఆర్‌డీ మాలతి తెలిపారు. గురువారం చింతగుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉప సర్పంచ్ ఎన్నిక జరిగింది. పంచాయతీలో 10 మంది వార్డు మెంబర్లు ఉండగా 9 మంది హాజరయ్యారు. ఉప సర్పంచ్‌గా జూపూడి అన్నపూర్ణ పేరును ఏకగ్రీవంగా సభ్యులు ప్రకటించారు.

రామిరెడ్డిపల్లి ఉప సర్పంచ్ ఏకగ్రీవం

చంద్రగిరి: మండల పరిధిలోని రామిరెడ్డిపల్లి ఉప సర్పంచ్ దీప ఆరు నెలల కిందట తన పదవికి రాజీనామా చేయడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. వైఎస్సార్‌సీపీకి 5 గురు వార్డు సభ్యులు, టీడీపీకి ముగ్గురు ఉన్నారు. ఈ క్రమంలో ఉప సర్పంచ్ పదవిని కైవసం చేసుకునేందుకు టీడీపీ కుటిల రాజకీయాలకు తెరలేపింది. వైఎస్సార్‌సీపీకి చెందిన వార్డు సభ్యులను భయభ్రాంతులకు గురిచేసి తమ వైపు తిప్పుకున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఉప సర్పంచ్ ఎన్నికల్లో వార్డు సభ్యులు టీడీపీ మద్దతుదారు వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

భారతీయ సంస్కృతి విశ్వవ్యాప్తం కావాలి



టాలెంట్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న అతిథులు, వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ: భారతీయ సంస్కృతి, సంస్కృత భాషను విశ్వవ్యాప్తం చేసేందుకు కృషి చేయాలని ఉస్మానియా వర్సిటీ సాంస్కృత అకాడమి డైరెక్టర్ ప్రొఫెసర్ పెన్నా మధుసూదన్ పిలుపునిచ్చారు. జాతీయ సంస్కృత వర్సిటీలో మూడవ అఖిల భారత సంస్కృత విద్యార్థుల టాలెంట్ ఫెస్టివల్ గురువారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా పెన్నా మధుసూదన్ ప్రసంగించారు. దేశంలో సంస్కృత అధ్యయనం ప్రథమస్థానంలో ఉందన్నారు. దేశ వాప్తంగా సంస్కృత విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీయడానికి వర్సిటీలో ఏర్పాటు చేసిన జాతీయ టాలెంట్ ఫెస్ట్ అభినందనీయమన్నారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ, ఈ పోటీలకు సుమారు 20వర్సిటీల నుంచి విద్యార్థులు పాల్గొంటున్నారని, విజేతలకు స్వర్ణ పతకాలతో పాటు నగదు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వెంకట నారాయణరావు, డీన్లు దక్షిణమూర్తి శర్మ, రజనీకాంత్ శుక్లా, ప్రొఫెసర్ రంగనాథన్, డాక్టర్ సీహెచ్ నాగరాజు, డాక్టర్ ఉదయం హెగ్డే, డాక్టర్ భరత్ భాషణ్, అధ్యాపకులు, వివిధ వర్సిటీల విద్యార్థులు పాల్గొన్నారు

తిరుపతి ప్రజలపై ఎందుకంత ద్వేషం

- టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డికి భూమన అభినయ్ బహిరంగ లేఖ



తిరుపతి మంగళం : పవిత్ర ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచితేనే స్థానిక ప్రజలతో పాటు శ్రీవారి భక్తులు సైతం ఆరోగ్యంగా ఉండగలరని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వకర్త భూమన అభినయ్ తెలిపారు. గురువారం ఆయన టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డికి లేఖ రాశారు. తిరుపతి అంటే ఎందుకంత ద్వేషం అని, పారిశుద్ధ్య పరిశుభ్రతను అడ్డుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. టీటీడీ సహకారంతో 1700మంది కార్మికులతో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచవచ్చన్న ఉద్దేశంతో చర్యలు చేపడితే దానిపై కోర్టుకు వెళ్లి అడ్డుకోవడం ఏమిటి ? అని భానుప్రకాష్‌రెడ్డికి లేఖలో ప్రశ్నించారు.

టీటీడీ సహకారం తీసుకుని..

మన తిరుపతి మహా నగరంగా అడుగులు వేస్తోందని.. ఇక్కడ నివాసం ఉంటున్న వారి సంఖ్యతో పాటు తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య కూడా భారీగా పెరుగుతోందన్నారు. కానీ ఈ పరిస్థితులకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులు లేరన్నారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య 855, డ్రైవర్ల సంఖ్య 135 కలిపి 990 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. 40 మంది ఉండాల్సిన చోట 15 మంది ఉండడం, ముగ్గురు చేయాల్సిన పనిని ఒక్కరే చేయడం, మున్సిపాలిటీ దగ్గర నిధులు లేకపోవడం, ప్రభుత్వం నుంచి అదనపు సిబ్బందిని నియమించుకునే అవకాశం లేకపోవడంతో తిరుపతి అధ్వానంగా మారిందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో టీటీడీ సహకారం తీసుకుని తిరుపతిని నాలుగు జోన్లుగా విభజించామన్నారు. టీటీడీ పాలకమండలి సమావేశంలో చర్చించి, ఆమోదం తెలిపి, టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లను నియమించి, వర్క్ ఆర్డర్ ఇచ్చే సమయంలో భానుప్రకాష్‌రెడ్డి కోర్టుకు వెళ్లి ఆపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణం మీరు కేసును ఉపసంహరించుకుని తిరుపతి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలంటూ లేఖలో కోరారు.

సరళమైన సంస్కృతంలో అన్నమయ్య సంకీర్తనలు



మాట్లాడుతున్న ఎస్వీయూ విశ్రాంత ఆచార్యుడు దామోదర నాయుడు

తిరుపతి కల్చరల్: తాళ్లపాక అన్నమయ్య వర్ణనావైచిత్రి నిరుపమానమని, తెలుగు వారికి అర్థమయ్యేలా సరళమైన సంస్కృతంలో సంకీర్తనలు రచించారని ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ హైస్కూల్ అధ్యాపకురాలు సుహాసిని తెలిపారు. అన్నమయ్య 522వ వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా అన్నమాచార్య కళామందిరంలో గురువారం సాహితీ సదస్సు నిర్వహించారు. ఆమె 'అన్నమయ్య సంకీర్తనలు- సంగీతం' అనే అంశంపై మాట్లాడారు. అన్నమయ్య అలతి అలతి పదాలతో సుమారు 80 సంకీర్తనలను సంస్కృతంలో రచించారని తెలిపారు. సంస్కృత కవులకు తెలుగు భాష రాకపోయినా పరవాలేదని, తెలుగు కవులకు మాత్రం సంస్కృతం తెలిసి ఉండాలన్నారు. ఎస్వీయూ విశ్రాంత ఆచార్యుడు దామోదర నాయుడు, గుంటూరు జిల్లా లేమల్లపాడు ఎంటీఎస్ పాఠశాలకు చెందిన డాక్టర్ రవికృష్ణ ప్రసంగించారు.

రూరల్ ఎంపీపీకి సన్మానం

భాకరాపేట : చంద్రగిరి నియోజక వర్గం తిరుపతి రూరల్ ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నిక జరగడం పట్ల చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండల కేంద్రాల్లో సంబరాలు జరుపుకున్నారు. అలాగే తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన మూలం చంద్రమోహన్‌రెడ్డిని చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, రెడ్డెమ్మ, చెంగల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సింహాల మోహన తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కడుపు కొడితే ఊరుకోం

తిరుపతి రూరల్ : రాజకీయ ఒత్తిళ్ల కారణంగా పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యమని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతమాకుల పుణ్యమూర్తి అన్నారు. తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీకి చెందిన 37 మంది పారిశుద్ధ్య కార్మికులకు 3 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో రెండు రోజులుగా నిరసన తెలుపుతున్నారు. గురువారం ఆయన కార్మికులకు మద్దతు తెలిపారు. కార్మికులంతా దళిత, గిరిజన వర్గాలకు చెందిన వారని.. వారి జీవన భృతిని నిలుపుదల చేయాలని చూస్తే సీఐటీయూ నేతలతో కలిసి పోరాడతామని హెచ్చరించారు.

ఎర్రచందనం కేసులో పదిమందికి జైలు

తిరుపతి లీగల్: ఎర్రచందనం దుంగలను అక్రమంగా నరికి పొలాల్లో అక్రమంగా నిల్వచేసిన కేసులో పదిమందికి ఆరు నెలలు జైలు శిక్ష, 1000 రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ ప్రత్యేక కోర్టు జడ్జి నరసింహమూర్తి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2014 అక్టోబర్ 15వ తేదీ ఎస్ఆర్ పురం మండలం సింధురాజపురం సమీపంలో సురేంద్ర బాబు నాయుడుకు చెందిన పొలాల్లో 23 ఎర్రచందనం దుంగలు నిల్వ ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఎస్ఆర్ పురం మండలం దిగువముద్దికుప్పం హరిజనవాడకు చెందిన ఎం.రామారావు, పి.సుబ్రహ్మణ్యం, ఎం.ఉపేంద్రన్, పి.పాపిరెడ్డిపల్లికి చెందిన శోభన్ బాబు, యుఎం పురం హరిజనవాడకు చెందిన ఆర్ముగం, తమిళనాడు షోలింగర్లోని వళ్లవంక కాలనీకి చెందిన రవి, విజయ్ కుమార్, పల్లిపట్టు తాలూకా ఆర్కేపేటకు చెందిన చిన్నప్పన్, తిరుత్తణి తాలూకా ముంబాకం సత్రానికి చెందిన వీఆర్ పురుషోత్తం, తిరువల్లూరు జిల్లా పోలూరు తాలూకా అర్జునపురానికి చెందిన వెంకటేష్‌ను అరెస్ట్ చేసి పుత్తూరు అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో హాజరు పరిచారు. వీరికి ఆరు నెలలు జైలు శిక్ష, 1000 రూపాయలు చొప్పున జరిమానా విధిస్తూ 2019 ఆగస్టు 6వ తేదీ జడ్జి తీర్పు చెప్పారు. దీనిపై వారు రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ కోర్టులో అపీలు చేసుకున్నారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయమూర్తి కింది కోర్టు విధించిన శిక్షను ఖరారు చేస్తూ తీర్పు చెప్పారు.

నోటీస్ బోర్డు

- జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలోని ఇండోర్ స్టేడియంలో ఉదయం 9.30 గంటలకు అఖిల భారత సంస్కృత విద్యార్థుల ప్రతిభా ఉత్సవాలు
- అన్నమయ్య వర్ధంతి సందర్భంగా అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 10.30 గంటలకు సాహితీ సదస్సు. సాయంత్రం 6 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు.
- శ్రీకోదండరామస్వామి వారి బ్రహ్మోత్సవాలకు ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు చిన్నశేష వాహన సేవ, రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు హంస వాహనసేవ మధ్య ధ్వజారోహణం, రాత్రి పెద్దశేష వాహన సేవ
- తిరుపతి సాహితీ సంస్థల ఆధ్వర్యంలో రాఘవేంద్రనగర్‌లోని సాయి దుర్గా బ్యాంకెట్ హాల్లో సాయంత్రం 5గంటలకు శ్రీవిశ్వావసు నామ ఉగాది వేడుకలు

నేడు న్యాయవాద సంఘ ఎన్నికలు

తిరుపతి లీగల్: తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ కార్యవర్గ పదవులకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 4.30 వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎన్నికల అధికారి ఉషాకిరణ్ తెలిపారు. ఎన్నికల్లో 1061 మంది న్యాయవాదులు ఓటు హక్కు కలిగి ఉన్నారన్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, మహిళా మెంబర్ పదవులకు ఎన్నికలు జరగనున్నట్లు చెప్పారు.

ముగిసిన వర్క్‌షాపు



అతిథులను సత్కరిస్తున్న వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో మూడు రోజుల పాటు నిర్వహించిన మైక్రోసాఫ్ట్ ఏఐ స్కిల్స్ వర్క్‌షాపు గురువారం విజయవంతంగా ముగిసింది. డీఎస్‌టీ క్యూరీ ఏఐ సెంటర్ ఆధ్వర్యంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్, మైక్రోసాఫ్ట్, కొయినిగ్ సొల్యూషన్స్ సంయుక్త సహకారంతో నిర్వహించారు. ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఆధునిక సాంకేతిక అవగాహన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వీసీ ఉమా మాట్లాడుతూ ఏఐ స్కిల్స్‌పై విద్యార్థులు అవగాహన కల్పించేందుకు వర్సిటీలో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజినీ, ప్రొఫెసర్ వెంకటకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

పద్మావతీ అమ్మవారి సేవలో ప్రముఖులు



అమ్మవారి ఆలయం వెలుపల డాక్టర్ సతీష్ రెడ్డి

తిరుపతి రూరల్ : శ్రీ పద్మావతీ అమ్మవారిని డిఫెన్స్ రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఆయన వెంట టీటీడీ పాలక మండలి చైర్మన్ భానుప్రకాష్ రెడ్డి కూడా రావడంతో ఆలయ అధికారులు అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేయించారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

భాకరాపేట : పంచాయతీ కార్మికులకు దుస్తులు, సబ్బులు, కొబ్బరినూనె అందజేసినట్లు చిన్నగొట్టిగల్లు ఈఓపీఆర్డీ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం చిన్నగొట్టిగల్లు పంచాయతీ కార్యాలయంలో స్థానిక సర్పంచ్ మనోహర్ చేతుల మీదుగా పంచాయతీ కార్మికులకు అందజేశారు.

పేదలకు అన్నదానం

చంద్రగిరి: పట్టెడన్న సేవాసమితి ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ ఆధ్వర్యంలో గురువారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 200 మందికి అన్నదానం చేసినట్లు ఆయన తెలిపారు.



